హైదరాబాద్ వార్త

సొంతింటి కల నెరవేరేనా..?

-డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం పేదల ఎదురుచూపులు
-ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధుల చుట్టూ చక్కర్లు
-ప్రజావాణిలో సైతం వేలల్లో దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 4,ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం పేదలు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరి గేలా తిరుగుతున్నారు. ప్రజా ప్రతినిధులకు వారికి ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటు న్నారు. గత సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో మొత్తం 1630 దరఖాస్తు వస్తే అందులో 1571 డబుల్‌బెడ్‌రూం దరఖాస్తులు ఉన్నాయంటే డిమాండ్ ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రేటర్ హైద రాబాద్లో అర్హులైన పేదలకు లక్ష డబుల్ బె డ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించిన వి షయం తెలిసిందే. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలోని పలు లొకేషన్లలో ఇండ్ల నిర్మాణం మొదలు పెట్టింది. కొన్ని చోట్ల నిర్మా ణం పూర్తి చేసుకోగా పేదలకు పంపిణీ చేశారు. ఇంకా చాలా చోట్ల నిర్మాణం పూర్తి కాగా పంపిణీ చేయకుండా నిలిపివేశారు మరికొన్ని చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ ఇండ్లలో తమకు అవకాశం దక్కుతుందో? లేదో అని పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితమే రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్మాణం పూర్తి చేసుకున్న ఇండ్లను అర్హులైన పేదలకు అందిస్తామని కలెక్టర్ చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి చైర్మన్ గా, కలెక్టర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారని చెప్పారు. దీంతో కొద్దిరోజులుగా కలెక్టరేట్ చుట్టూ పేదలు సొంతింటి కోసం దరఖాస్తులు పట్టుకుని కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

అటు ప్రజా ప్రతినిధులచుట్టూ..

ఒవైపు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తూనే మరోవైపు ఎమ్మెల్యేలు,ఎంపి, మంత్రి ఇలా ప్రజాప్రతినిధుల ఇండ్ల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో గ్రేటర్ ఎమ్మెల్యేలు తమ కార్యాలయంలో ఉన్నా, బస్తీలకు వెళ్లినా వీటి గురించే ప్రజలు అడుగుతుండడంతో వారికి నచ్చచెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. కొంత మంది తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఇతర ప్రజాప్రతి నిధులతో సిఫారసు లెటర్లు తీసుకొస్తున్నారు. పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే తమకు బాగా తెలుసని కొంతమంది, బందువు అని మరికొంత మంది ఇండ్ల కోసం తంటాలు పడుతున్నారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఎమ్మెల్యేలు డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం వచ్చేవారి అనుమానాలను నివృత్తి చేస్తూ త్వరలో అందుతాయని నచ్చజెప్పి పంపిస్తున్నారు. అలాగే మూసీ సుందరీకరణలో భాగంగా రివర్ బెడ్‌లో నివాసముంటూ ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని ప్రకటించింది. ఇప్పటికే కొంత మంది ఆయా ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూం ఇండ్లలోకి వచ్చి చేరారు. దీంతో ఇప్పటికే కట్టిన ఇండ్ల పంపిణీ పూర్తయితే మళ్లీ కొత్తగా కట్టేది ఎప్పుడు ? తమకు వచ్చేది ఎప్పుడనే అనుమానాల మధ్య పేదలు దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పోటెత్తుతున్న దరఖాస్తుదారులు...

కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే అర్జీల్లో సింహభాగం డబుల్ బెడ్రూం ఇండ్ల గురించే ఉంటుండడం గమనార్హం. గత సోమవారం కలెక్టర్లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 1630 దరఖాస్తులు వస్తే అందులో 1571 దరఖాస్తులు కేవలం డబుల్ బెడ్‌రూంకు సంబంధించనవే ఉండటం విశేషం. ఈ లెక్కలు చూస్తేనే గ్రేటర్ ప్రజలు ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఎంతగా ఆరాట పడుతు న్నారో తెలిసి పోతుండగా తమ సొంతింటి కల నెరవేరుతుందో, లేదోనని పేదలు ఎదురు చూస్తున్నారు.

స్కూళ్లు, కాలేజీల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

- సైన్‌బోర్డులు, డంబుల్స్ స్టిక్స్ ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

హైదరాబాద్, జనవరి 4,ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాఠశాలలు, కళాశాలల వద్ద సైన్ బోర్డులు,డంబుల్ స్టిక్స్ ఏర్పాటు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి డిఈఓ ను ఆదేశించారు. ఈమేరకు శనివారం రవాణా, డిఈఓ, జిహెచ్ఎంసి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ శాఖల అధికారులతో రోడ్డు భద్రత మాసోత్సవాలపై సమీక్షించి తగు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేయనున్న ట్రాఫిక్ అవేర్ పార్కుల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ రోహిణిని, జిల్లా లో 55 బ్లాక్ స్పాట్ లను గుర్తించి 37 పూర్తి చేయడం జరిగిందని మిగిత వాటిని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని జిహెచ్ఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను ఆదేశించారు. రోడ్డు భద్రతపై భారీ ర్యాలీని నిర్వహించాలని సూచించారు. అంతకు ముందు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణపై, జిల్లా కలెక్టర్లు జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని నేడు రోడ్డు భద్రతా మాసోత్సవం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ వినూత్నంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పిల్లల్లో రోడ్డు భద్రతా ప్రమాణాల పై అవగాహన కల్పించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ, రోడ్డు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు భద్రత కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన కార్యక్రమాల్లో హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ వినియోగించేలా ప్రోత్సహిస్తూ కొంతమందికి హెల్మెట్ పంపిణీ చేయాలని తెలిపారు.

నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

-జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్‌గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం తదితరులు

హైదరాబాద్, జనవరి 4,ప్రభాతవార్త: నగర ప్రజలకు అన్ని సౌకర్యాలతో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి పనులు చేపట్టబడుతున్నామని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఈమేరకు శనివారం 3 కోట్ల 54 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ పనులకు స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడంలో నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా వివిధ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు మేయర్ తెలియజేశారు. తాజ్ కృష్ణ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రూ. 11.5 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను, జివికె మాల్ ఎదురుగా రూ. 12.75 లక్షల తో పూర్తి చేసిన జంక్షన్ అభివృద్ధి పనులను మేయర్ ప్రారంభించారు. రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టిన జవహర్ నగర్ పార్క్‌లో ఓపెన్ ఎయిర్ మినీ థియేటర్ ను ప్రారంభోత్సవం చేశారు. కె బి ఆర్ పార్క్ దగ్గర జంక్షన్ అభివృద్ధిలో భాగంగా రూ.1.96 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన సుందరీకరణ పనులను ప్రారంభించారు. నంది నగర్ రోడ్ నెం. 14 లో మల్టిపుల్ ప్రాంతాలను కలుపుతూ (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి నంది నగర్ వరకు) రూ. 145.80 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, బంజారాహిల్స్ రోడ్ నెం.14లో రూ.148 లక్షల వ్యయంతో మసీదు నుంచి బ్రహ్మకుమారీస్ వరకు వివిధ ప్రాంతాలను కలుపుతూ నిర్మిస్తున్న సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనులతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని మేయర్ పేర్కొన్నారు.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ... నగరంలో మెరుగైన రవాణా అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వడం జరిగిందని, హెచ్ సిటి ద్వారా నగరంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అండర్ పాస్‌లు ఫ్లై ఓవర్‌లు నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్.ఇ రత్నాకర్, కార్పొరేటర్ మన్నె కవిత, ఈఈలు పాల్గొన్నారు.

చెంగిచర్ల ఎలక్ట్రిక్ బైక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం..!

-ఎలక్ట్రికల్ బైక్‌లు దగ్ధం .... ప్రమాదంపై అనుమానాలు

చెంగిచర్ల రామకృష్ణనగర్‌లో ఎలక్ట్రిక్ బైక్ గోదాంలో మంటలు చెలరేగిన దృశ్యం.

ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త : చెంగిచర్లలోని ఒక ఎలక్ట్రికల్ బైక్ తయారీ యూనిట్‌లో శనివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. కొద్ది రోజుల క్రితమే ఇక్కడ ప్రారంభమైన ఈ గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించి పలు వాహనాలు, ఇతర సామాగ్రి బూడిదైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం పరిధిలోని చెంగిచర్ల రామకృష్ణనగర్ కాలనీలో ఒక గోదాంలో కొద్ది రోజుల క్రితం వర్స్ గ్లోబల్ ట్రేడ్ ఇవి ప్రైవేటు లిమిటెట్ కంపెనీ ఏర్పాటు చేశారు. ఇందులో ఎలక్ట్రిక్ బైక్‌లను తయారు చేయడంతోపాటు, షోరూం కూడా ఏర్పాటు చేశారు. అయితే శనివారం సాయంత్రం కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అగ్ని ప్రమాదక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అర్పివేశారు. ఈ ప్రమాదంలో పలు వాహనాలు, ఇతర సామాగ్రి కాలిపోయినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. సంఘటనా స్థలంలో సిబ్బంది అప్రమమత్తంగా ఉండడంతో ఎటువంటి ప్రాణనష్టం లేదని పోలీసులు పేర్కొంటున్నారు. అగ్ని ప్రమాదంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కంపెనీలో నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని పలువురు పేర్కొంటున్నారు. ఎంత నష్టం జరిగిందనే విషయం ఇంకా అంచనా వేయలేదని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని కంపెనీ నిర్వహకులు పేర్కొంటున్నారు. మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గరిష్ట శిక్షా రేటును సాధించడమే లక్ష్యంగా పని చేయాలి : సిపి సుధీర్ బాబు

నేరేడ్‌మెట్, జనవరి 4 ప్రభాతవార్త : రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇటీవల నమోదైన కొన్ని కేసులలో సత్వరమే స్పందించి నేరస్తులను పట్టుకొని బాధితులకు న్యాయం చేసిన పోలీసు అధికారులు,సిబ్బందిని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ శనివారం నేరేడ్మెట్ లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ.. నేర పరిశోధన, దర్యాప్తులో పాల్గొనే అన్ని స్థాయిల సిబ్బంది మరియు అధికారులు నేరస్తులకు శిక్ష పడే ఏకైక లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. సామాన్య ప్రజల పట్ల నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టకూడదని, నేరం ఎవరు చేసినా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి చట్ట ప్రకారం శిక్షలు పడేలా పనిచేయాలని పేర్కొన్నారు. నేరస్తులకు శిక్షా రేటును పెంచే లక్ష్యంతో రాచకొండ కమీషనరేట్ పరిధిలో కేసుల దర్యాప్తు సమయంలో పాటించవలసిన విధానాలు మరియు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుపుతూ ఎస్ ఓ పి మరియు చెక్ లిస్ట్ లను అనుసరిస్తూ అందరూ సమన్వయంతో పనిచేస్తే నేరస్తులకు తగిన శిక్ష పడుతుందన్నారు. అదే విధంగా పోలీసులు, ప్రాసిక్యూటర్స్ కలసి కేసుకు సంబంధించిన విషయాలను చర్చించి నేరస్తులకు తగిన శిక్ష పడే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో గరిష్ట శిక్షా రేటుతో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు రాచకొండ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ లను మరియు కోర్టు డ్యూటీ ఆఫీసర్ల కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఏసిపి ఐటి సెల్ నరేందర్ గౌడ్, ఏసిపి సి.సి.ఆర్.బి రమేష్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

బేకరీలలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

కంటోన్మెంట్, జనవరి 4 ప్రభాతవార్త: సికింద్రాబాద్ పరిధిలోని పలు ప్రాంతాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు బేకరీలలో తనిఖీలు నిర్వహించారు. అధికారులకు దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కార్ఖానాలోని ఓ బేకరీలో అధికారుల అనుమతి లేకుండా కేక్‌లను సిద్ధం చేయడానికి ఆల్కహాల్ ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి వివరాలు లేబుల్‌పై కూడా ముద్రించలేదు. కేక్ తయారీలో ఉపయోగించే పాత్రలు, ఇతర వస్తువులు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు.కేకుల్లో ఉపయోగించడానికి డ్రై ఫ్రూట్స్, జామ్‌లను కలిపి పెద్దమొత్తంలో గుజ్జును సిద్ధం చేసి ప్లాస్టిక్ డ్రమ్ములలో నిలువచేసినట్లు గుర్తించారు. రసాయనాలు, నాన్‌వెజ్ ఆర్టికల్స్‌లతో పాటు ఇతర వస్తువులు ఒకేచోట నిల్వఉంచినట్లు గ్రహించారు. అల్వాల్‌లోని ఓ బేకరీలో కూడా తనిఖీలు జరిపారు. ఏమాత్రం నిబంధనలు పాటించకుండా కేక్‌లను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. బేకరీలో ఎలుకలు, బొద్దింకలను గుర్తించారు. ఏసీలో లోపాల కారణంగా గదిలోని ట్రేలలో నిల్వఉంచిన ఆహార పదార్థాలు కలుషితమవుతున్నట్లు గ్రహించారు. గడువు ముగిసిన కేసర్ సీరప్, ఫ్లేవర్స్‌లాంటి ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించారు.

లాలాపేట్‌లో దారుణం

-రెండు రోజులుగా గదిలోనే తల్లికుమారుడి మృతదేహాలు
-తల్లి మరణాన్ని తట్టుకోలేక కుమారుడు ఆత్మహత్య

తార్నాక, జనవరి 1 ప్రభాతవార్త : తల్లి మరణాన్ని తట్టుకోలేక కుమా రుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాధకర సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. లాలాపేట్ వినోభానగర్ బస్తీలో గత 8 సంవత్సరాల నుంచి లక్ష్మి(43), ఆమె కుమారు డు అభినయ్ (22) ఓ ఇంటిని అద్దెకు తీసుకొని నివాసముంటు న్నారు. కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా లక్ష్మి కేన్సర్ వ్యాదితో బాదపడుతూ చికిత్స పొందుతుంది.ఈ క్రమంలో ఆమె ఆరోగ్యం కుదుట పడకపోవడంతో రెండు రోజుల క్రితం ఇంట్లోనే మృతి చెందింది. తల్లి మృతిని చూసి తట్టుకోలేక కుమారుడు అభినయ్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ చావుకు ఎవరూ కారణం కాదంటూ సూసైడ్ లెటర్ రాశాడు. అయితే రెండు రోజులుగా తల్లి, కుమారుడి మృతదేహాలు గదిలోనే ఉన్నాయి.ఈ క్రమంలో దుర్వాసన రావడంతో వీరి ఇంటి సమీపంలో ఉండే వారి ఇంటి యజమాని పోలీసు లకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రెండు మృతదేహాలను గాంధీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హిట్ అండ్ రన్ ఘటనలో గాయపడ్డ యువకుడు మృతి

సరూర్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త: రోడ్డు దాటుతున్న ఒక యువకుడిని అతి వేగంతో వెళ్తున్న ఓ ద్విచక్రవాహన చోదకుడు ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయిన ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుడు మృత్యువుతో పోరాడి ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచాడు. ఈ విషాదకర సంఘటన హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ కీసర నాగరాజు కథనం ప్రకారం ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తున్న జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీకి చెందిన కూరెళ్ళ అనిల్‌కుమార్ (26) నూతన సంవత్సరం ప్రారంభం రోజు జనవరి 1న సాయంత్రం తన స్నేహితుడు వంగూరి పవన్‌తో కలిసి జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ కాలనీ (బిజెపి క్వార్టర్స్)లో చికెన్ సెంటర్ ముందున్న ఆర్‌సిఐ రోడ్డును నడుచుకుంటూ దాటుతుండగా అదే సమయంలో అతి వేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయాడు. దీంతో తలకు తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూనే బాధితుడు శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో కేసును నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు నిందితుడిని గుర్తించడానికి ప్రమాదం జరిగిన రోడ్డుకు ఇరువైపులా ఉన్న సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఇన్స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ సుధాకర్ కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాదాపూర్‌లో అక్రమ నిర్మాణాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

మాదాపూర్‌లో అక్రమనిర్మాణాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్,అధికారులు

శేరిలింగంపల్లి, జనవరి 4 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని అయ్యప్ప సొసైటీలో 684 గజాలలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. జీహెచ్ఎంసీ నోటీసులు, హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 5 అంతస్తుల భవనాన్ని నిర్మించటంపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు హైడ్రా,రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి అయ్యప్ప సొసైటీలోని వంద ఫీట్ల రోడ్డుకు ఆనుకుని ఉన్న కట్టడాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అక్కడికక్కడే జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ అధికారులు ఇచ్చిన షోకాజ్‌నోటీసులతో పాటు హైకోర్టు ఉత్తర్వులను కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. అ క్రమ కట్టడమని హైకోర్టు నిర్ధారించాక కూడా కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా భవనాన్ని నిర్మించటంపై జీహెచ్ఎంసీ అధికారులు, కూల్చివేతకు సంబందించి షోకాజ్ నోటీసు ఇచ్చినా పట్టించుకోకుండా భవనాన్ని నిర్మించటాన్ని హైడ్రా కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. అక్రమ భవన నిర్మాణాన్ని కూల్చివేస్తున్నట్లు గత ఏడాది ఫిబ్రవరి 2, షోకాజ్ నోటీసులు జీహెచ్ఎంసీ జారీ చేసంది. అదే విధంగా ఫిబ్రవరి 26న స్పీకింగ్ ఆర్డర్ కూడా ఇచ్చింది. ఆ తరువాత హైకోర్టు కూడా రిట్‌పిటషన్ నంబర్ 10030/2024పై స్పందిస్తూ అమ్ర నిర్మాణమని నిర్ధారించటమే కాకుండా చర్యలు తీసుకోవాలని ఏప్రియల్19,2024న ఆదేశించింది. హైకోర్టు ఆర్డర్‌ను ఆధారంగా తీసుకుని జూన్ 13,2024వ తేదిన ఇదే భవనం అక్రమమని జీహెచ్ఎంసీ కొంత భాగాన్ని కూల్చివేసింది. ఇవేమీ పట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగించారంటూ స్థానిక అధికారులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

గిరిజన సంక్షేమాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రాంబాల్ నాయక్, చందర్ నాయక్ తదితరులు

హైదరాబాద్, జనవరి 4,ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో గిరిజన సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, గిరిజన సంక్షేమ శాఖకు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన విధులను విడుదల చేయ కుండా కాలయాపన చేస్తూ గిరిజనులను మోసం చేస్తోందని గిరిజన సంఘాలు ఆరోపించాయి. షెడ్యూల్డ్ ట్రైబ్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబల్ నాయక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 32 ఆదివాసీ గిరిజన తెగల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ చట్టాల అమలు, విధివిధానాల రూపకల్పన, షెడ్యూల్ ప్రాంత హక్కులను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టిందని ఆరోపించారు. గిరిజన సంక్షేమ శాఖను గత ప్రభుత్వం నీరుకార్చగా ఈ ప్రభుత్వం సైతం అదే వైఖరిని కొనసాగిస్తున్నదని ఆరోపించారు. ఇటువంటి పరిణామం గిరిజనులు, గిరిజన సంఘాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో గిరిజన సంక్షేమానికి నిధులు కేటాయించిన నిధులను విడుదల చేయడంలో తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజనుల సంక్షేమం కొరకు ఖర్చు చేసిన బిల్లులను మేమెందుకు చెల్లించాలనే ఉద్దేశంతోనే బిల్లులను చెల్లించడం లేదన్నారు. గత ప్రభుత్వ ఖర్చుల బిల్లులను విడుదల చేయకుండా పూర్తిగా రద్దు చేయాలని కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయినా ఇంతవరకు పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడం వలనా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి పై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి తక్షణం స్పందించి బలహీన పడుతున్న గిరిజన సంక్షేమ శాఖ బలోపేతానికి చర్యలు తీసుకుని గిరిజన శాఖకు మంత్రిని నియమించాలని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ను ఏర్పాటు చేసి, గిరిజన సంక్షేమ శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే ట్రై కార్ సంస్థకు ఇవ్వాల్సిన 219 కోట్ల రూపాయలను తక్షణం విడుదల చేయాలని లేకపోతే షెడ్యూల్డ్ ట్రైబ్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో విశ్లవాత్ చందర్ నాయక్ ప్రధాన కార్యదర్శి తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మ నాయక్,ఆర్ శ్రీరాం నాయక్. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, సహాయ కార్యదర్శి స్వరూప భాయి. తెలంగాణ ఆదివాసి ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, ప్రధాన కార్యదర్శి కుతాడి రవికుమార్. ఆదివాసి తోటి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆత్రం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు గుర్తింపు సత్కారం : జస్టిస్ శేషశయన రెడ్డి

చిక్కడపల్లి, జనవరి 4 ప్రభాతవార్త: తమలోని ప్రతిభాసంపత్తికి గుర్తింపు సత్కారం అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయన రెడ్డి అన్నారు. శనివారం రాత్రి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రము

ప్రజ్ఞా పేరుతో జాతీయ సదస్సు

అవంతి విద్యాసంస్థ సదస్సులో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణరెడ్డి, చిత్రంలో అవంతి శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, జనవరి 4 ప్రభాతవార్త

కాచిగూడ, జనవరి 4: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలను కల్పించడానికి సన్నహాలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టరెడ్డి అన్నారు. బర్కతపుర ఆవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ప్రజ్ఞా 2025 పేరుతో జాతీయ సదస్సును శనివారం కాచిగూడ మున్నూరుకాపు సంఘం మ్యాడం ఆంజయ్య హాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ ఎం.రామ్మోహన్రావు, ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసమూర్తి, బీకే వసంతలక్ష్మీ, అనుపమ రాజన్, అవంతి కళాశాలల వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టరెడ్డి హాజరై మాట్లాడుతూ రానున్న రోజులు భారతదేశం యువతదేనని, విద్యార్థులకు విద్యావకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త ఆలోచనలతో దేశ అభివృద్ధికి తొడ్పాలని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించడానికి ఆహర్నిశలు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆవంతి కళాశాలల అధ్యక్షురాలు ఎం.జ్ఞానేశ్వరి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రియాంక, ఎండీ శ్రవణ్కుమార్, ఉపాధ్యక్షుడు నందీశ్, హెచ్ఎర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ధనంజయ్ సింగ్, విద్యాసాగర్, ముద్రిక ఖందేల్వేల్, ప్రిన్సిపాల్ అప్పారావు, సెక్రటరీ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత

డ్రైనేజి పనులను ప్రారంభిస్తున్న నార్సింగి చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్.

నార్సింగి, జనవరి 4 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని మంచిరేవుల శివపురి కాలనీలో రూ.15.లక్షలతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. కుల,మత,పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనులు చేస్తున్నామని వివరించారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని తెలిపారు. ప్రజలిచ్చిన అధికారంతో ప్రజలకు మేలు చేసేలా అహర్నిషలు కష్టపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పతకాలను నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అర్హులందరికి అందేలా నావంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. సీఎం రేవంత్రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గత పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను వెలికి తీసి, లోటు బడ్జెట్ను పూడ్చుకుంటూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునరెడ్డి, రాంచందర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన సీవరేజ్ పైప్ లైన్ పనుల పూర్తికి చర్యలు

-కార్పొరేటర్ పావనీ వినయకుమార్

సివరేజి పైప్‌లైన్ పనులను పరిశీలించిన గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

చిక్కడపల్లి, జనవరి 4 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్,బాలాజీ రాంసుఖ్ స్వీట్ హౌస్ సమీపంలో,ఇటీవల మొదలైన నూతన సివరేజి పైప్ లైన్ పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పైప్‌లైన్ పనులను త్వరగతిన పూర్తి చేసి ప్రజలకు ఉపయోగకరంగా అందుబాటులోకి తేవాలని అధికారులకు, పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్,సిబ్బందికి సూచించారు. వీటితో పాటు డివిజన్ లో పలు చోట్ల కొనసాగుతున్న పైప్‌లైన్ పనులను సైతం త్వరలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటం తెలిపారు. పర్యవేక్షణలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ. ఎ.వినయ్ కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ ఇన్స్పెక్టర్ మల్లేష్, శంకర్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, ఎం.ఉమేష్, ప్రకాష్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, భారత్, విజయలక్ష్మి స్థానికులు పాల్గొన్నారు.

ఒ.యూ ఎన్జీవోస్ క్యాలండర్ ఆవిష్కరణ

నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విసి ప్రొ. కుమార్ మొలుగారం

తార్నాక, జనవరి 4 ప్రభాతవార్త :

ఒ.యూ పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌ల్లో శనివారం ఒ.యూ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఒ.యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం నరేష్ రెడ్డి, ఒఎస్డీ టూ వీసీ జితేందర్ నాయక్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ లో జరిగే మార్పులకు ఉద్యోగులందరు సహకరించాలని, కలిసి పనిచేయాలని ఉస్మానియా యూనివర్సిటీ కీర్తిని ఉన్నత విద్యారంగంలో ముందుకు తీసుకొని పోవాలని కోరారు. ఉద్యోగ సంఘాలను అభినందిస్తూ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ నాయకులతో పాటు జ్ఞానేశ్వర్, నాగరాజు, శివ శంకర్, అక్బర్ బైగ్, విజయ్ కుమార్, భీమయ్య, శంకరయ్య, రవి, అశోక్ కేతావత్ శంకర్ నాయక్, యూసఫ్, భూమ రావు రాకేష్ పాటు టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కురుమలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి : ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, జనవరి 4,ప్రభాతవార్త:

తెలుగు రాష్ట్రాల్లోని కురుమలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ పదవులు కేటాయించాలని అందులోనూ నామినేటెడ్ పదవులకు అవకాశం కల్పించాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కాచిగూడలో ఏపీ కురుమ సంఘం ఆధ్యక్షులు జబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 23న మదనపల్లి లో జరిగే కురుమల రాష్ట్ర మహా సభ పోస్టర్‌ను జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బి.సి.లకు విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టడానికి, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే తెలుగు రాష్ట్రాలలో ఉన్న మాదిరిగా అన్ని రాష్ట్రాలలో ఫీజు రియంబర్స్మెంట్ స్కీం, ప్రతి ఒక్కరికి స్కాలర్ షిప్ , హాస్టల్స్, గురుకులాల మంజూరు, బీసీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయడం లాంటి స్కీములు దేశమంతట అన్ని రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో బి.సి లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని అందుకు

అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, జబ్బల శ్రీనివాస్, నీలం వెంకటేష్ తదితరులు

రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బి.సి లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బి.సి యాక్టు"ను తీసుకరావాలన్నారు. అలాగే స్థానిక సంస్థలలో బి.సి రిజర్వేషన్లు 20 నుంచి 40 శాతంకు పెంచాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం వెంకటేష్, అనంతయ్య, వేముల రామకృష్ణ, నికిల్, రవి, నరేష్, అశీష్, బాలయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్‌ను కలిసిన బిఎంఎస్ డ్రైవర్ల సంఘం ప్రతినిధులు

చిక్కడపల్లి, జనవరి 4 ప్రభాతవార్త: కేంద్ర జాతీయ కార్మిక సంఘం అయిన భారతీయ మజ్దూర్ సంఘ్ కు అనుబంధంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు రవిశంకర్ అల్లూరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, కిమ్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, శ్రీనివాస్, చల్ల ప్రదీప్ తదితరులు శనివారం ట్రా ఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ వద్ద అంబులెన్స్ పార్కింగ్ అధిక చాలన్ విధించడం సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో కమిషనర్ స్పందిస్తూ రోగులకు అందుబాటులో అంబులెన్స్ లు ఉండే విధంగా అలాగే ట్రాఫిక్ కి అంతరాయం కలగాకుండా తగిన నిర్ణయం తీసుకొంటామని హామీ ఇచ్చారు. గత మూడు నెలలుగా బేగంపేట ట్రాఫిక్ సిఐ పార్కింగ్ లో ఉన్న అంబులెన్స్‌లకు ఫోటోలు తీసి వేల రూపాయల చాలాన్ విధించడం అంబులెన్స్ లు సీజ్ చేసి పోలీసు స్టేషన్ లో పెట్టడం జరుగుచున్నదని, ఇదే విషయంపై అడుగగా అంబులెన్స్‌లు పెట్టవద్దని ప్రైవేట్ కార్లు పెట్టుకుంటారని అంటున్నారని, సిఐ ప్రోత్సాహంతో వైద్యులు, ప్రైవేట్ కార్లు పార్కింగ్ చేయిస్తున్నారని ఆరోపించారు. హాస్పిటల్ కు వచ్చే రోగుల

నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్‌ను కలిసిన బిఎంఎస్ గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు రవిశంకర్ అల్లూరి

కు అందుబాటులో అంబులెన్స్ లు ఉంచి వారికి ఇబ్బంది కలుగకుండా ధరలు కూడా రోగులకు ఇబ్బంది కలుగకుండా వారికి తగ్గట్టుగా సేవ నివృత్తి తో పని చేస్తున్నామని వివరించారు. అంబులెన్సుల డ్రైవర్లుగా కొన్ని వందల కుటుంబాలు ఆధారపడ్డాయని, కిమ్స్ ఎదురుగా ట్రాఫిక్ కు కూడా ఇబ్బంది కలిగించడం లేదుని, కావున తమ ఇబ్బందులను రోగుల కు ఎమర్జన్సీ కింద అవసరంకు ఉపయోగపడు అంబులెన్స్ పార్కింగ్ ను సుగమం చేసి న్యాయం చేయాలని కోరారు. ముఖ్యంగా రోగులకు అందుబాటులో ఉంచిన అంబులెన్స్ లకు విధించిన వేల రూపాయల చలాన్ ను రద్దు చేయాలని కోరారు.

దర్శకుడు రచయితలకు కత్తిమీదసాము సినీ టీవిరంగాలు : పార్థసారథి

రవీంద్రభారతి, జనవరి 4 ప్రభాతవార్త : ప్రస్తుత ఆధునిక పరిస్థితులు, పోటీ సమాజంలో సినీ టీవిరంగాల్లో దర్శకుడుగా, రచయితగా ఎదగడం ఎంతో కష్టసాధ్యం.. కత్తిమీద సామువంటిదని ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటేనే గానీ ముందుకుసాగలేమని తెలంగాణ రాష్ట్ర మాజీ ఎన్నికల ప్రధానాధికారి సి.పార్థసారథి అన్నారు. ముఖ్యంగా సర్వసాధారణ అంశాలు ఏమాత్రం పనికిరావని, అన్ని విషయాల్లో సృజనాత్మకత చాలా అవసరమని, ఎంతో ఓర్పు నేర్పు, నిరంతరసాధన, జ్ఞానాన్ని పెంచుకోవడం, పుస్తక పఠనం, అంకితభావంతో పనిచేయాల్సి ఉంటుందని, అన్నింటికంటే మరీముఖ్యం ఓపిక, ఒదిగివుండే లక్షణాలు చాలా అవసరమని స్పష్టం చేశారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకుసాగాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం, భారత్ కల్చరల్ అకాడమీ, ఓంసాయి తేజ ఆర్ట్స్ సంయుక్త నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో శని ఆదివారాలు రెండురోజులపాటు జరుగుతున్న సినీ, టీవి దర్శకులు, రచయితల శిక్షణా శిబిరం ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సి.పార్థసారథి విశిష్ట అతిథులు

శిక్షణా శిబిరంలో ప్రసంగించిన పార్థసారథి, మామిడిహరికృష్ణ, నాగబాల తదితర అతిథులు

డా. మామిడి హరికృష్ణ, నరేందర్‌రెడ్డి, చిత్తరంజన్‌దాస్, స్వప్న మనాస్ దండనాయక్, శ్రీనివాసరాజు, లక్ష్మీనారాయణ, విశ్వనాథ్, భాస్కర్‌శాస్త్రి, ప్రేమ్ కమల్ సురేందర్‌ల తోపాటు ఈ శిక్షణా శిబిరంలో ఫ్యాకల్టీలు నాగబాల సురేష్ కుమార్, శ్రీశైలమూర్తి, డిఓపి.మీర్, ప్రేమ్‌రాజు, భానుకిరణ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం జరిగిన ఈ శిక్షణా శిబిరంలో వందమంది ఔత్సాహికులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి లబ్దిదారునికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

చార్మినార్,జనవరి 4 ప్రభాతవార్త : జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ కార్యాలయంలో శనివారం జాయింట్ జోనల్ కమిషనర్ శైలజతో బహదూర్‌పుర,చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీల ఇంఛార్జీలు పులిపాటి రాజేష్ కుమార్, మహ్మద్ ముజీబుల్లా షరీఫ్,బోయ నగేష్,,కె.రవిరాజ్‌లు సమావేశమయ్యారు.ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తులు పెట్టుకున్న ప్రజలు నుంచి ఎంక్వైరీ చేస్తున్న సిబ్బంది ప్రతీ ధరఖాస్తుదారుడు నుంచి మూడు వందల నుంచి మూడు వేల రూపాయలు వరకు డిమాండ్ చేసి వసూళ్లు చేస్తున్నారని,ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు చార్మినార్ జోనల్ జాయింట్ కమిషనర్ శైలజను కోరారు.ఇందిరమ్మ ఇండ్లు ఎంక్వైరీ పేరుతో డబ్బులు తీసుకుంటున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసువాకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ విషయమై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని,ఎంక్వైరీ సాఫీగా జరుపుతామని జాయింట్ కమిషనర్ శైలజ తెలిపారని వారు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు

జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జాయింట్ జోనల్ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

పులిపాటి రాజేష్ కుమార్,మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ ,బోయ నగేష్,కె.రవిరాజ్‌లు మాట్లాడుతూ అర్హులైనప్రతీ లబ్దిదారుడుకి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని,ఈ విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదుచేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట,సంతోష్ నగర్ డిఎంసిలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ నేత ప్రొ.కేశవరావు జాదవ్ సతీమణి ఇందిర మృతి

తార్నాక, జనవరి 4 ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమ నేత ప్రొ.కేశవరావు జాదవ్ సతీమణి ఇందిర హైదరాబాద్ డీడీ కాలనీలో శనివారం మృతి చెందారు. ఆమె మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న పలువురు తెలంగాణ ఉద్యమ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి సంతాపం.....

నిస్వార్థ ఉద్యమకారుడు, తెలంగాణ వైతాళికుడు దివంగత ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సతీమణి ఇందిర మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. స్వరాష్ట్ర సాధన పోరులో, హక్కుల ఉద్యమాల్లో జాదవ్ సారుకు అన్ని రకాలుగా తోడుగా నడిచిన ఇందిరమ్మ ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని అన్నారు.2018లో జాదవ్ సారును ఇప్పుడు వారి సతీమణి ఇందిర ను కోల్పోవడం తెలంగాణ సమాజానికి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. జాదవ్ సార్ఇందిరమ్మ గార్ల ముగ్గురు కుమార్తెలు, వారి కుటుంబీకులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పాతబస్తీ మైదాన్ ఖాన్ చౌక్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరగనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ప్రధాన అర్చకులు శృంగారం రమణా చార్యులు,ప్యారసాని వెంకటేష్

అనురాగ్ హస్టల్‌లో క్యాబ్ డ్రైవర్ దారుణహత్య..!

ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త : నగర శివారులోని మేడిపల్లి పిఎస్ పరిధిలోని పీర్జాదిగూడలోని ఒక హస్టల్‌లో క్యాబ్ డ్రైవర్ దారుణహత్యకు గురైయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పిఎస్ పరిధిలోని పీర్జాదిగూడ మల్లికార్జున నగర్ కాలనీలోని అనురాగ్ రెడ్డి వర్కింగ్ బాయ్స్ హస్టల్‌లో జనగామ జిల్లా, లింగాల గణపురం మండలం, బండ్ల గూడెం గ్రామానికి చెందిన అనిరెడ్డి మహేందర్‌రెడ్డి (36) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ హస్టల్ లో ఉంటున్నాడు. అయితే శుక్రవారం రాత్రి హస్టల్‌లో మహేందర్‌రెడ్డిని వంటకు ఉపయోగించే వంటకు ఉపయోగించే కత్తులు, గంటెలు, ఇతర సామాగ్రితో బలంగా కొట్టి హత్య చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. వంట కత్తితో పలు చోట్ల పొడిచినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని చూడగా అప్పటికే నిందితులు మృతి చెందినట్లు తెలిపారు.

వివాహేతర సంబంధమే కారణమా..?

కాగా క్యాబ్ డ్రైవర్ మహేందర్‌రెడ్డి హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ హస్టల్‌లో ఉండే ఒక మహిళతో అతను సన్నిహితంగా ఉండేవాడని, అది వివాహేతర సంబంధానికి దారి తీసి ఉండవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు. అయితే అతను హస్టల్ లో ఉండకుండా మరో చోట ఉంటూ అప్పుడప్పుడు వచ్చి వెళ్లే వాడని, శుక్రవారం రాత్రి మద్యం సేవించి హస్టల్‌కు వచ్చి గొడవ పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హస్టల్‌లో ఉండే కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఉచ్ఛల జలధిరంగా' కవితా సంకలనంపై నిరసన

చిక్కడపల్లి, జనవరి 4 ప్రభాతవార్త: లేఖిని రచయిత్రులు కొందరు కలిసి 'ఉచ్ఛల జలధిరంగా' కవితా సంకలనంపై నిరసన ప్రకటించే కార్యక్రమం శనివారం నిర్వాహకురాలు అత్తలూరి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో చెంగల్వల కామేశ్వరి, సుమతి, రమా శాండిల్య, బి ళీ. లక్ష్మి,సర్వమంగళ గౌరీ, శామీర్ జానకి తదితరులు పాల్గొన్నారు. కొందరు హిందూ వ్యతిరేక కవులు అందరూ కలిసి రాసిన కొన్ని కవితలతో ఒక సంకలనం తీసుకువచ్చి, దానికి భారతదేశ పవిత్ర జాతీయ గేయం లోని కొన్ని పంక్తులు తీసుకుని శీర్షికగా ఉపయోగించుకున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ అంశంపైన సామాజిక మాధ్యమాల్లో మూడు రోజులుగా తీవ్రమైన నిరసన వ్యక్తం అవుతోంది. ఎందరూ దేశాభిమానులు జాతీయ గేయాన్ని కించపరిచే విధంగా ఉచ్ఛల జలధిరంగా అని శీర్షిక పెట్టడాన్ని తీవ్రంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ రాసిన ఆ గేయం భారతీయులు వేదమంత్రంలా పాడుకోడం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇదే కవుల వర్గంలో కొందరు ఇంతకు ముందు 'అశుద్ధ భారత్' అనే శీర్షికతో ఒక పుస్తకం తేవడం జరిగింది. వారిలో కలుగుతున్న అనేక మానసిక వికారాలకు హిందూ దేవుళ్ళను ఎగతాళి చేయడం, ఏ దేశంలో బతుకుతున్నారో ఆ దేశాన్ని అవమానించడం, పైగా ఇలాంటి వాళ్లకి గౌరవనీయ సంస్థ సాహిత్య అకాడమీ పురస్కారాలు ఇచ్చి గౌరవించడం జరుగుతోంది. సాహిత్య అకాడమి పురస్కారం ఒకప్పుడు గొప్ప కవులు, రచయితలూ అందుకున్నారు.

కానీ గత 15 ఏళ్లుగా అస్మదీయులకి పంచడం జరుగుతోంది అని, 60 పేజీల పుస్తకంకి కూడా సాహిత్య అకాడమీ ఇచ్చారని, హిందూ మతాన్ని, భారత దేశాన్ని, మన పురాణాలాను, ఇతిహాసాలను విమర్శించే వాళ్లకి ఇలాంటి పురస్కారాలు ఇవ్వవచ్చారని రచయిత్రులు ప్రశ్నించారు. వెంటనే ఇలాంటి పుస్తకాలను బాన్ చేసి, పురస్కారాలు వెనక్కి తీసుకోవాలని లేఖిని రచయిత్రులు కోరారు.

ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్

చిక్కడపల్లి, జనవరి 4 ప్రభాతవార్త: కమ్మ కమ్యూనిటీకి చెందిన యువతులకు ఉచిత సివిల్‌సర్వీసెస్, గ్రూప్ 1 కోచింగ్ కమ్మ జన సేవాసమితి డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్, న్యూఢిల్లీ సంయుక్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, చెన్నై ప్రాంతాల కమ్మ కమ్యూనిటీకి చెందిన యువతులకు ఉచిత కోచింగ్ అందిస్తున్నట్లు చైర్మన్ డా. లక్ష్మయ్య శనివారం తెలిపారు. ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 28 మంది అభ్యర్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంత్రి సత్యకుమార్ యాదవ్ ద్వారా స్పాన్సర్ చేసినట్లు తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన 19 మంది అభ్యర్థుల కోసం ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి ఆనంద్ ద్వారా స్పాన్సర్ చే యబడ్డారన్నారు. ఉచిత కోచింగ్ ప్రోగ్రామ్ ఎంపికైన అభ్యర్థులకు ఒక సంవత్సరం ఉచిత కోచింగ్ (ఆన్లైన్) మరియు తదుపరి రెండు సంవత్సరాలు ఆన్లైన్ కోచింగ్, ఉచిత వసతి, భోజనం. ఉచిత లైబ్రరీ యాక్సెస్, పుస్తకాలు ట్యాబ్ లు, ఉచిత టెస్ట్ సిరీస్ సౌకర్యాలు అందించబడతాయన్నారు. ఈ ప్రోగ్రామ్ కోసం అగ్రగామి 50 నుండి 100 మంది విద్యార్థులను ఎంపిక చేయడానికి ఒక ఎంపిక పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. జనవరి 5న సాయంత్రం 4:00 నుంచి 5:00 వరకు గుంటూరు జేకేసీ కాలేజ్, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్, హైదరాబాద్, వినుకొండలలో జరుగుతాయని పేర్కొన్నారు.

సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన శ్రీలత శోభన్‌రెడ్డి

సీఎంకు పుష్పగుచ్చాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు

తార్నాక, జనవరి 4 ప్రభాతవార్త : సీఎం రేవంత్ రెడ్డికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, మరియు టీటీయు సీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి బంజారాహిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగాకలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన రామారావుగౌడ్

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్చాన్ని అందజేసి అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డా.వట్టికూటి రామారావుగౌడ్

తార్నాక, జనవరి 4 ప్రభాతవార్త : టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఆయనకు పుష్పగుచ్చాన్ని అందజేశారు. మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన వారిలలో ఎఐసిసి జనరల్ సెక్రటరీ బికే హరిప్రసాద్, సత్యం గౌడ్, డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ తధితరులు ఉన్నారు.

కార్మికులపై అధికారుల వేధింపులు అరికట్టాలి

- సిఐటియు జిల్లా నాయకులు చంద్రశేఖర్

ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు, కార్మికులు

నిజాంపేట్, జనవరి 4, ప్రభాతవార్త

కార్మికులపై అధికారుల వేధింపులు అరికట్టాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ అన్నారు. శనివారం తెల

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

-ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జనవరి 4 ప్రభాతవార్తః చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఖచ్చితంగా నాణ్యత పాటించాలని నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ పరిధిలోని బండ్ల బస్తిలో జరుగుతున్న డ్రైనేజ్ పైప్ లైన్,స్ట్రోమ్ వాటర్ లైన్ జరుగుతున్నా పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి బాండ్ల బస్తీ లో పర్యటించి అక్కడ ప్రస్తుతం జరుగుతున్న డ్రైనేజ్ పైప్ లైన్,స్ట్రోమ్ వాటర్ లైన్ జరుగుతున్న పనులను తెలుసుకున్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో జరుగుతున్న డ్రైనేజ్ పైప్ లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఎల్ఏ అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డివిజన్ ప్రెసిడెంట్ భీష్మ,కాచిగూడ సీనియర్ నాయకులు డాక్టర్ శిరీష ఓం ప్రకాష్ యాదవ్ బస్తివాసులు అధికారులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహ శక్తులపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

డిసిపి రష్మిపెరుమాల్‌తో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,జనవరి 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల్లో సంఘ విద్రోహ శక్తులు అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్న పోకిరీలపై, గంజాయి అమ్ముతున్న వారిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్, ఉత్తర మండలం డిసిపి సాధన రష్మిపెరుమాల్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన డిసిపితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అవసరమైన చోట్ల సీసీ కెమరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు రెండు రోజుల క్రితం బేగంపేట పీఎస్ పరిధిలోని రసూల్‌పురా, శ్రీలంక బస్తీ, అర్జున్ నగర్, బాలంరాయి, క్రిష్ణా నగర్ ప్రాంతాల్లో ఐదు టీమ్‌లను ఏర్పాటు చేసి 80 పోలీస్ సిబ్బందితో సెర్చ్ అపరేషన్ నిర్వహించామన్నారు. గంజాయి సేవిస్తున్న 20 మందిని,బహిరంగంగా మద్యం సేవిస్తున్న 25 మందిని, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతు న్న 10 మందిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. అందుకు ఎమ్మెల్యే డిసిపిని అభినందించారు.

అయ్యప్ప స్వామి దర్శనం జన్మ జన్మల పుణ్యఫలం : తలసాని

అయ్యప్ప స్వాముల శబరిమలై యాత్రలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట,జనవరి 4 ప్రభాతవార్త: శబరిమలై యాత్ర,అయ్యప్ప స్వామి దివ్య దర్శనం జన్మజన్మల పుణ్యఫలమని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆదర్శ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజలో తలసాని కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వాముల శబరిమలై యాత్రను ప్రారంభించారు.

ఎమ్మెల్యే పద్మారావుకు శుభాకాంక్షలు తెలిపిన దళిత్ సిల్ట్ వెహికిల్స్ఓనర్స్

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను అభినందిస్తున్న దళిత బంధు లబ్ధిదారుల అసోసియేషన్ ప్రతినిధులు వడ్లూరి రమేశ్ తదితరులు

అడ్డగుట్ట,జనవరి 4 ప్రభాతవార్త: తెలంగాణ దళిత సిల్ట్ వెహికిల్ ఓనర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు శనివారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత్ సిల్ట్ వెహికిల్స్ఓనర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు మామిడి శ్రీనివాస్‌రావ్, రాంచందర్, వడ్లూరి రమేశ్,జి.నాగేశ్, ఎస్.కిరణ్, జి.మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వడి బియ్యం సమర్పిస్తే కోర్కెలు నెరవేరుతాయి: జంపన

చిన్నతోకట్ట గడీల మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,జనవరి 4 ప్రభాతవార్త: అమ్మవారికి వడి బియ్యం సమర్పిస్తే కోరిన కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ 1వ వార్డు చిన్న తోకట్టలోని శ్రీ గడీల మైసమ్మ ఆలయంలో ఇటీవల నిర్వహించిన విగ్రహ ప్రతిష్టలో భక్తులు అమ్మవారికి సమర్పించిన వడి బియ్యంతో శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జంపన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కొండల్ యాదవ్, ముఖేశ్ యాదవ్, జాజుల క్రాంతి, జై కుమార్, జగదీశ్, మధు, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

టీపీఏ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంఘం అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రామచందర్, ఏ.సుధాకర్, తేజ తదితరులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు : నార్త్‌జోన్ డిసిపి

-బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్

బేగంపేట జనవరి 4,ప్రభాతవార్త

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ హెచ్చరించారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో డీసీపీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం ,గంజాయి సేవించడం,ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు,బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి,బేగంపేట ఇన్స్పెక్టర్ చిర రామయ్య తదితర సిబ్బందితో కల్సి డీసీపీ బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా, అన్నా నగర్,శ్రీలంక బస్తీ,ఓల్డ్‌పాటిగడ్డ,ప్రకాశం నగర్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న 25మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, గంజాయి సేవించినా,అమ్మ కాలు జరిపినా అలాంటి వారిని గుర్తించి వారిపైన కేసులు నమోదు చేస్తామన్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ తో పాటు నార్త్‌జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని డీసీపీ తెలియజేసారు. ఖాళీ జాగాలు,బహిరంగ ప్రదేశాలలో నిరంతరం పోలీసుల నిఘా కొనసాగుతుందని,అలాంటి ప్రాంతాల్లో ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై అనుక్షణం నిఘా పెట్టి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీసీపీ పిలుపు నిచ్చారు. మత్తుకు బానిసలవుతున్న యువత వారి జీవితాలు అంధకారంలోకి పోతుండటంతో వారి తల్లి దండ్రులు తీవ్రంగా కుంగి పోతున్నారని,యువత మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. వారు అప్రమత్తంగా ఉండాలని, డీసీపీ హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఏసీపీ గోపాల కృష్ణమూర్తి,ఇన్స్పెక్టర్ చిర రామయ్య ఎస్సైలు,పోలీసులు పాల్గొన్నారు.

రసూల్‌పురా ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్.

వంటశాలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

వంటశాల ప్రారంభోత్సవంలో మైనంపల్లి హనుమంతరావు

అల్వాల్, జనవరి 4 ప్రభాతవార్త: ఓల్డ్‌అల్వాల్‌లోని చారిత్రాత్మకమైన సీతారామచంద్ర స్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వంటశాల, అతిథి గృహాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు. నాలుగు శతాబ్దాలు చరిత్ర కలిగిన ఆలయంలో నూతన వసతులు కల్పించడంలో మైనంపల్లి సహాయ సహకారాలు ఉన్నాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పరాంధామ చంద్ర ప్రకాష్ రావు, రఘుపతిరావు, నాగేశ్వరరావు, భారతి కాంగ్రెస్ నేతలు నిమ్మ అశోక్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ మృతికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం

ముషీరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త: సీనియర్ జర్నలిస్ట్ ఎన్.సి.భీంరావు మృతి పట్ల హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర సంతాపం తెలియచేశారు. శనివారం ఆయన ఒక సందేశం ఇస్తూ మూడు దశాబ్దాలుగా పాత్రికేయ రంగంలో విశేష సేవలు అందించిన భీంరావు హఠాన్మరణం విచారకరమని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో అనేక సమస్యలను తన వార్తా కథనాల ద్వారా అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేశారని, అటువంటి భీంరావు మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. భీంరావు ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ భీంరావుకు జర్నలిస్టుల నివాళులు: భీంరావు భౌతికకాయానికి మౌలాలీలోని ఆయన స్వగృహంలో జర్నలిస్టులు నివాళులర్పించారు. అనంతరం భీంరావు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి, ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నాయకులు సీహెచ్.వీరారెడ్డి, కనకరాజు, సాగర్, రాంరెడ్డి, నాగరాజు, జనసమితి గ్రేటర్ అధ్యక్షులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ఎవరూ డబ్బులు ఇవ్వొద్దు

-వసూళ్లకు ఎవరైనా పాల్పడితే తెలియజేయండి

-సనత్‌నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్‌సుధాం

బేగంపేట జనవరి 4,ప్రభాతవార్త

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తా మంటూ ఎవరైనా దళారులు పేదల వద్దకు వస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దని,ఎవరికీ ఎలాంటి డబ్బులు ఇవ్వవద్దని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశాల్‌సుధాం తెలియజేసారు. అలా ఎవరైనా డివిజన్‌లో వసూళ్లకు పాల్పడుతుంటే వారి వివరాలు తమకు తెలియజేయాలని ఆయన అన్నారు. ఇటీవల పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు వస్తున్నారని,ఇదే సమయంలో కొందరు దళారులు పేదలకు తాము ఇళ్లు మంజూరు చేయిస్తామంటూ నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలు బస్తీలకు చెందిన వారు తన దృష్టికి తీసుకు వచ్చారని,అలాంటి వారికి ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు చెల్లించవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేసారు. సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ దృష్టికి ఈ విషయాన్ని తీసికెళ్లి అలాంటి వారిపై ఫిర్యాదు చేయనున్నట్లు విశాల్ తెలియజేసారు. అర్హులైన పేదలకు ప్రభుత్వం పరిశీలించి ఇళ్లు మంజూరు చేస్తుందే తప్ప దళారులు చేయరని ఈ సందర్భంగా తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని విశాల్ సుధాం తెలియజేసారు.

హోర్డింగ్‌లను తొలగించిన కంటోన్మెంట్ బోర్డు

కంటోన్మెంట్,జనవరి 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని జెబిఎస్,కార్కాన, లాల్‌బజార్ ప్రధాన రోడ్డు మార్గంలోని రాజీవ్ రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు శనివారం బోర్డు సిబ్బంది తొలగించారు.

కెటిఆర్‌ను కలిసిన చార్మినార్ బిఆర్ఎస్ నాయకులు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెశిడెంట్ కేటిఆర్‌ను కలిసిన చార్మినార్ బిఆర్ఎస్ నాయకులు

చార్మినార్,జనవరి 4 ప్రభాతవార్త : చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇలియాస్ ఖురేషీ,టినాగరాజుతో పాటు పలువురు నాయకులు కలిసి నూతన సంవత్సరం సందర్భంగా బిఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షులు కేటిఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇలియాస్ ఖురేషీ,నాగరాజులు మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలోనే పాతనగరం ఎంతగానో అభివృద్ధి సాధించిందని తెలిపారు.

బాలికల కబడ్డి టోర్నమెంట్ విజేత శ్లోకా స్కూల్

విద్యార్థినులకు మెమెంటో ట్రోఫీ అందచేసిన నిర్వాహకులు

బేగంబజార్,జనవరి 4ప్రభాతవార్త: మహాత్మా జ్యోతిరావు, సావిత్రి జ్యోతిరావు పూలే సమాజ శ్రేయస్సు,చైతన్యంకోసం ఎంతో కృషి చేసినట్లు జియాగూడ డివిజన్ బిజెపి కార్పొరేటర్ బొయిని దర్శన్ అన్నారు. సావిత్ర బాయిపూల్ 194 జయంతి ఉత్సవాలల్లో భాగంగా రెండురోజుల పాటు ఇంటర్ స్కూల్ బాలికల కబడ్డి టోర్నమెంట్ పోటిలు నిర్వహించారు. జియాగూడలోని శ్లోకా స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన కబడ్డి పోటిలల్లో హైదరాబాద్ జిల్లాలోని 13 బాలికల కబడ్డి క్రీడాకారులజట్లు తరలి వచ్చి పోటిలలో పాల్గొన్నారు. శ్లోకా స్కూల్ కబడ్డి జట్టు,కృష్ణవేణి కబడ్డి జట్టుపై విజయం సాధించారు. కార్పొరేటర్ బోయిన దర్శన్, యువ కేంనరద జిల్లా అధికారి ఖుష్బూగుప్తా, మహాత్మాజ్యోతిరావు పూలే యువమంచ్‌అధ్యక్షులు కె.ఎమ్.గురుచరణ్‌లు విజేత జట్టుకు బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో శ్లోకా ప్రిన్సిపల్ డైరెక్టర్ నాగేశ్వర్,రాష్ట్ర యువజన అధ్యక్షులు పి.మహేందర్,ప్రతినిధులు వి.శివచరణ్,మాగి ప్రభాకర్, తిరుమలరావు,శ్లోకా స్కూల్ డైరెక్టర్లు రత్నాష్‌జైస్వాల్, అన్వేష్,వైస్ ప్రిన్సిపల్ అమితాచరణ్,విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్పభక్తులు వావర్ మజీద్‌కు వెళ్లొద్దు :ఎమ్మెల్యే రాజాసింగ్

జెండా ఊపి ఊపుతున్న ఎమ్మెల్యే టి.రాజాసింగ్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్‌లు

గోషామహల్,జనవరి 4ప్రభాతవార్త: శబరిమలై వెళ్లే మార్గంలో ఉన్న వావర్ మజీద్‌కు అయ్యప్ప స్వాములు,వెళ్లకూడదని గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ అన్నారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆద్వర్యంలో న్యూ ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ కార్యాలయం శబరిమలై నీల్‌కల్ వద్ద అన్నదానం చేసేని త్యావసర సరుకుల లారీని ఎమ్మెల్యే టి.రాజాసింగ్, కార్పొరేటర్లు జి.శంకర్‌యాదవ్,రాకేష్‌జైస్వాల్,బాస్ అధ్యక్షులు రాధా కృష్ణగురుస్వామి,కోశాధికారి మేడిశెట్టి రాకేష్,కోశాధికారి అనిల్,రాజు మహారాజ్‌లతో కలసి జెండా ఊపి జెండాను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా జనవరి మాసంలో శబరి మలై వెళ్లె అయ్యప్పస్వాములకు జనవరి 7నుంచి 14 తేది వరకు అయ్యప్పస్వాములకు నీల్‌కల్‌వద్ద వేలాది మంది అయ్యప్పస్వాములకు అన్నదానం,అల్పహారం చేయడం సంతోషదాయకమన్నారు. 41 రోజులపాటు మాల ధరించిన అయ్యప్పస్వాములు వావర్‌మజీద్‌కు వెళ్ల వద్దని,అంతేకాకుండా అక్కడి వెళ్లాలని కేవలం కుట్ర అని అన్నారు. నేరుగా పంబానదికి వెళ్లి అక్కడ నుంచి శబరిమలైలోని అయ్యప్ప స్వామి సన్నిధికి వెళ్లాలన్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులే నిజమైన హీరోలు

-నార్త్‌జోన్ ట్రాఫిక్ ఎసిపి శంకరరాజు

నేచెరికేర్ ఆసుపత్రిలో వైద్యవిధ్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న నార్త్‌జోన్ ఏసీపీ శంకరరాజు.

బేగంపేట జనవరి 4ప్రభాతవార్త

ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులే నిజమైన హీరోలు అని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు. శనివారం బల్కంపేట నేచెర్ క్యూర్ ఆసుపత్రి వైద్యులకు రోడ్డు ప్రమాదాలు నివారణ అనే అంశంపై నేచర్ క్యూర్ వైద్య విధ్యార్థులకు ఏసీపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రహదారులపై ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రెడ్ సిగ్నల్ పడిన సమయంలో కొందరు వాహనాలు ఆపకుండా వెళ్లే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. కొందరు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే రూ 5000లు వరకు జరిమానా తో పాటు మూడు నెలల జైలు శిక్షను కూడా విధిస్తారని అన్నారు. 2023 సంవత్సరంలో 6173మంది, 2024సంవత్సరంలో 3300 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లేని వారికి బేగంపేట టీటీఐ లో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం నడిపే సమయంలో వాహనం నడిపే వ్యక్తి వెనుక కూర్చున్న వ్యక్తి ఇద్దరూ హెల్మెట్లు ధరించాలన్నారు. కారులో ప్రయాణించే వారు తప్పక సీటు బెల్టు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 100మంది వైద్య విధ్యార్థులు,నేచర్ క్యూర్ హాస్పిటల్ వైద్యులు డా,లక్ష్మణ్,డా.మల్లిఖార్జున్,డా.కృష్ణ హాస్పిటల్ సిబ్బంది ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

12న సంక్రాంతి సాహిత్య సాంస్కృతిక సంబరాలు

-గోడప్రతులు ఆవిష్కరించిన స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ డైరెక్టర్ సూర్యతేజ సుభ్రాంత్ మాస్టర్

ముషీరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త: ఈనెల 12వ తేదీ సంక్రాంతి సాహిత్య సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నామని స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ డైరెక్టర్, టీవీ కొరియోగ్రాఫర్ ఈ.సూర్యతేజసుభ్రాంస్ మాస్టర్ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన సంబరాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కవుల్లో, రచయితల్లో, కళాకారుల్లో దిగి ఉన్న సాహిత్య, సాంస్కృతిక కళా ప్రతిభను పోటీల ద్వారా వెలికితీసి ప్రోత్సహించాలనే సదుద్దేశంతో స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో ఈ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాహిత్యంకు సంబంధించి కవితలు, నానీలు, మిని కథలు, సంగీతానికి సంబంధించి కర్ణాటక, హిందుస్థానీ, శాస్త్రీయ సంగీతం, లైట్ మ్యూజిక్, త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలు, దేశభక్తి గీతాలు, భజన, జానపద మరియు సినీ గీతాలు ఉంటాయని, నృత్యంకు సంబంధించి కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, పేరిని నృత్యం, కథక్, జానపద, ఫిల్మ్ మరియు వెస్టరన్, సోలో డ్యుయేట్, డబుల్స్ మరియు గ్రూప్ ఉంటాయని, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో గిటార్, కీ బోర్డ్, డ్రమ్స్, తబలా, మృదంగం, హార్మోనియం, వయోలిన్‌లు ఉంటాయని, అదేవిధంగా మిమిక్రీ, ఏకపాత్రాభినయం, కరాటే, కుంగ్‌ఫు మొదలైన స్టేజి పెర్‌ఫామింగ్ ఆర్ట్స్‌లలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి కలవారు ఏ వయస్సు వారైనా ఈ సంబరాలలో పాల్గొనవచ్చునని, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్, విభాగాల వారీగా, స్త్రీ పురుషులకు వేరు వేరుగా నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక సంబరాలలో పాల్గొనదలచిన వారు ఈనెల 10వ తేదీ లోగా 78939 40600 నెంబర్‌కు ఫోన్ చేసి, తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞశర్మ, ఫిల్మ్ కేంద్ర సెన్సార్‌బోర్డ్ సభ్యులు కృష్ణాది శేషు, యోగా గురువులు డాక్టర్ కోటేశ్వరరావు, లయన్ ఉమా శంకర్‌రెడ్డి, కూచిపూడి నృత్య గురువులు ప్రతిభారాజుగౌడ్, భరతనాట్య గురువులు గీతాశ్రీ, లయన్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న సూర్యతేజసుభ్రాంత్ మాస్టర్

డ్రగ్స్‌ను నివారించడంలో పోలీసులకు సహకరించాలి : ఎసిపి జయపాల్‌రెడ్డి

సికింద్రాబాద్, జనవరి 4 ప్రభాతవార్తః మాదక ద్రవ్యాలను తరిమికొట్టాల్సిన బాధ్యత నేటి యువతపైనే ఉందని చిలకలగూడ డివిజన్ ఏసీపీ జయపాల్‌రెడ్డి తెలిపారు. సీతాఫల్‌మండిలోని ఓప్రైవేట్ కాలేజీలో యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికమైన మత్తుకోసం విద్యార్థులు కొందరు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారికి అలవాటు పడి జీవితాలను, మంచి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. డ్రగ్స్ విద్యార్థులకు ఎంతో తేలికగా దొరుకుతున్నాయని, ప్రభుత్వం డ్రగ్స్ వినియోగాన్ని నివారించడం కోసం చాలా సీరియస్‌గా ఉందన్నారు. డ్రగ్స్ తీసుకున్నా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డ్రగ్స్‌ను తీసుకోకూడదని, తోటి విద్యార్థులు తీసుకుంటున్నా కాలేజీ యజమాన్యానికి సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు కాలేజీలో డ్రగ్స్ తీసుకుంటే విద్యార్థులతో పాటు కాలేజీ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. చాలాకాలం పాటు కనీసం బెయిలు కూడా దొరకని పరిస్థితి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ కొన్ని రకాల వ్యసనాలకు అలవాటు పడి విద్యార్థులు సైబర్ ఫ్రాడ్‌కు గురవుతున్నారని అన్నారు. కొన్ని కాలేజీలలో ఇప్పటికే కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సైబర్ ఫ్రాడ్, సీసీ కెమెరాల పట్ల విద్యార్థులకు సీఐ అనుదీప్ అవగాహన కల్పించారు. రాత్రిళ్లు విద్యార్థులు అనవసరంగా రోడ్లపైకి, వీధుల్లోకి రావద్దని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ ఫ్రాడ్, సీసీ కెమెరాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఏసీపీ జయపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్‌లు

అంతటా భగవంతుడు ఉన్నాడనేదే సనాతన ధర్మం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్, జనవరి 4,ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరిలో భగవంతుడున్నాడని అదే విధంగా అన్నిచోట్లా భగవంతుడు ఉన్నాడనే భావన భారతీయ సంస్కృతిలోనే మిళితమై ఉందని తెలంగాణ రాష్ట్

కమనీయం కడు రమణీయం శ్రీ వేంకటేశ్వర కల్యాణం..!

వనస్థలిపురం. జనవరి.4.ప్రభాతవార్త.

బ్రాహ్మణపల్లి పరిణయ కన్వెన్షన్ హాల్ నందు శ్రీ రేణుక రాజా రాజేశ్వరి శక్తిపీఠం జగన్మాత సేవలో మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పద్మావతి పరిణయ మహోత్సవ కార్యక్రమానికి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శ్రీ రేణుక రాజేశ్వరి శక్తిపీఠం నవీన్ శర్మ అయ్య ఆధ్వర్యంలో పద్మావతి పరిణయ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠం సభ్యులు రవీందర్ రెడ్డి,ద్పీ. మల్లేశం, మధుసూదన్ రెడ్డి,పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి,రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేవైఎం సెక్రటరీ పవన్ కుమార్ రెడ్డి,హర్ష మరియు తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి హిల్స్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

క్రాంతి హిల్స్ కాలనీలో సమస్యలు తెలుదుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం. జనవరి.4.ప్రభాతవార్త : వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రాంతి హిల్స్ కాలనీలో సమస్యల పరిస్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎల్.బి.నగర్. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు బద్ధం రాంరెడ్డి,ప్రధాన కార్యదర్శి కంచర్ల సత్తిరెడ్డి లు పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేయాలని,అదేవిధంగా కాలనిలో లింకు రోడ్లు మూసివేయడం తో రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన రహదారి నుండి కాలనీకి లింకు రోడ్ల అభివృద్ధి కి,పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతిని ధులు ఎం. వెంకట్ రెడ్డి,ఎం. శ్రీనివాస్, వి.మనోహర్,హాజీ ముస్తఫా అలీబి.గాలెయ్య,పి.శ్రీనివాస్ రెడ్డి,సి.ఎచ్. ధనంజయ,ఎన్. నారాయణ, వై.లచ్చిరెడ్డి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి చర్యలు : చైర్‌పర్సన్ జయశ్రీరాజు

సీసీ రోడ్డు శంకుస్థాపనలో చైర్‌పర్సన్, కౌన్సిలర్

హయత్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త: వార్డుల వారిగా సమస్యలను పరిష్కరించి మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధి 4వ వార్డులోని మైత్రిలహరి కాలనీలో 5 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేయనున్న సీసీరోడ్డు పనులకు ఆమె స్థానిక కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు కనీస మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఈక్రమంలో అన్ని వార్డులలో తాగునీరు, డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిదీపాల వంటి అభివృద్ధి పనుకు అవసరమైన నిధులను కేటాయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు భిక్షమయ్య, ప్రతినిధులు రమణమూర్తి, మదుకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, మురళి, రఘుబాబు పాల్గొన్నారు.

నాచారం డివిజన్ అభివృద్ధికి సహకరించాలి

- జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, జనవరి 4 ప్రభాతవార్త : కార్పొరేటర్ శాంతి సాయిజన్ నాచారం డివిజన్‌లోని పలు సమస్యలపై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి చర్చించారు. ప్రధానంగా నాచారం పాత గ్రామంలో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులు ఇంకా కొంతమేర నిలిచిపోవడం జరిగిందని తక్షణమే మిగతా సిమెంటు రోడ్డులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు, పటేల్ గుంట చెరువులలో గుర్రపు డెక్క తిరిగి విపరీతంగా వచ్చి చేరిందని దీనివల్ల నాచారం ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నారని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకుని రావడం జరిగింది.అలాగే పటేల్ కుంట చెరువు మరియు హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువులపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం నిధులు కెటాయించాలని కోరారు. అలాగే చాలాకాలంగా వీధి దీపాలు లేక చాలా ప్రాంతాలు చీకటిగా ఉంటుందని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకుని రావడం జరిగింది. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్ పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఘనంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు

ఉప్పల్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త : ఉప్పల్ రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, ఉమ, ఎవో కృష్ణారావు, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంవిఐ రవీందర్‌రెడ్డి, ఉమా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో రవాణా కార్యాలయం సిబ్బంది పాల్,అరుణ్, అభిలాష్, స్టీపెన్, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ : చైర్మన్ ముత్తినేని వీరయ్య

మలక్ పేట,జనవరి 4, ప్రభాతవార్త: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందించి అండగా ఉంటుందని తెలిపారు. లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలను పురస్కరించుకొని మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి, సంస్థ కార్యదర్శి అనిత రామచంద్రన్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శైలజలు ముఖ్యఅతిథిగా విచ్చేసి లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా జ్యోతి ప్రజలను చేసి లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి బ్రెయిలీ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నారని తెలిపారు. దివ్యాంగుల సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని వివరించారు. రూ.4 కోట్లతో ప్రభుత్వ సదనాలు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించడం జరిగిందని, త్వరలో దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ నీ ఆదర్శంగా తీసుకోవాలని, అంధులు పట్టుదలతో తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురు దివ్యాంగులను వారు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏడి రాజేందర్ రెడ్డి ,గంగారం, చందన సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్మన్ మూత్తినేని వీరయ్య, చిత్రంలో మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి, కార్యదర్శి అనితా రామచంద్రన్, ఎండి శైలజ తదితరులు

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే సమ్మెకు సిద్ధం

తుర్కయంజాల్ జనవరి 4,ప్రభాతవార్త : మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్, ఫిక్స్ ఢ్ ఫే, తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బంది నందరినీ పర్మినెంట్ చేయాలని, రెండవ పిఆర్సి లో కనీస వేతనం రూ.26,000/ లుగా నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈరోజు, రేపు 48 గంటల పాటు మున్సిపాలిటీల ముందు దీక్షలు జనవరి 6వ తేదీన కలెక్టరేట్ ముట్టడికి కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తుర్కయంజాల్ మున్సిపల్ యం సత్యనారాయణ కార్మికులు శివ కృష్ణ మహేష్ వెంకటేష్ భాగ్యమ్మ మంకమ్మ ఎల్లమ్మ అండాలు లక్ష్మి సులోచన జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

హయత్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ డ్‌పే కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కనీస వేతనాన్ని 26000 రూపాయలుగా చెల్లించాలని, కార్మికులకు రెయిన్‌కోట్లు స్వెట్టర్లు, దుస్తులు, పాదరక్షలను సకాలంలో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండె శివకుమార్, జవాన్ నరసింహ, రవి, మైసయ్య, బాబు, వసంత, లక్ష్మమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నాం

హయత్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని నిత్యహోమ్స్‌లో పర్యటించి కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. సొంత నిధులను ఏర్పాటుచేసుకున్న తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమస్యల తీవ్రతను బట్టి నిధులను కేటాయించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగా తాగునీరు, డ్రైనేజీ పనులను పూర్తిచేసి అనంతరం సీసీరోడ్లు ఇతర అభివృద్ధి పనులను చేపడతామని వివరించారు. కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు అభివృద్ధి పనులను ఎప్పటికపుడు పర్యవేక్షించి సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలను తమకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, సభ్యులు శ్రీనివాస్, సుధాకర్, ప్రదీప్‌రెడ్డి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో కలిసి నిత్యహోమ్స్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తా: కార్పొరేటర్

హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మార్నింగ్ వాక్‌లో భాగంగా శనివారం శుభోదయ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వస్తోందని, వీదిదీపాలు సైతం లేకపోవడంతో రాత్రి వేళ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్‌కు కాలనీవాసులు వివరించారు. దీనిపై కార్పొరేట ర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్య మయినంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నర్సింహ ముదిరాజ్, సభ్యులు శంకర్, శ్రీరాములు, సుమన్‌రెడ్డి, పుట్ట యాదయ్య,రాహుల్ పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం

మీర్‌పేట్ పెద్ద చెరువు వద్ద శంకుస్థాపన చేసిన సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి తదితరులు

సరూర్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్థానిక మీర్‌పేట్ పెద్ద చెరువు వద్ద ప్రజల ఉపయోగార్థం నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణం పనులకు శనివారం మాజీ మంత్రి, నియోజకవర్గ శాసనసభ్యురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీలలో చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనులు చేస్తూ పలు ప్రాంతాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్న సబితారెడ్డి కొత్తగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లో పెద్ద చెరువు వద్ద క్రీడా ప్రాంగణం నిర్మాణానికి సంకల్పించారు. ఈ నేపథ్యంలో రూ.1.80 కోట్లతో క్రీడా ప్రాంగణంతో పాటు చెరువు కట్ట ఫెన్సింగ్ పనులను శనివారం ఆమె స్థానిక మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్, బిజెపి ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దోమలపల్లి ధనలక్ష్మి రాజ్‌కుమార్, పలువురు కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డిఇఇ వెంకన్న, ఎఇఇ శ్రీనివాసులు, కార్పొరేటర్లు పసునూరి బిక్షపతిచారి, సిద్దాల లావణ్య బీరప్ప, కొంద్రు గౌరీ శంకర్, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, జఠావత్ శ్రీనివాస్ నాయక్, తీగల సాయినాథ్‌రెడ్డి, మాదరి రమేష్, హాము నాయక్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తేరేటిపల్లి శ్రీనివాస్ గుప్త, పాలపర్తి విజయలక్ష్మి, లలితా జగన్, జమాల్‌పూర్ సునీత, పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, సుర్వి లతా శేఖర్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.వైకుంఠధామాన్ని పరిశీలించిన సబితారెడ్డి అనంతరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మీర్‌పేట్ వైకుంఠ ధామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలు, కావాల్సిన వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె వైకుంఠధామంలో చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన సదుపాయాల గురించి అధికారులకు దిశానిర్దేశనం చేశారు.

ఇద్దరు యువతుల అదృశ్యం...

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని...

హయత్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త: విధినిర్వహణలో భాగంగా ఇంట్లో నుంచి వెళ్లిన యువతి కన్పించకుండా పోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... మునగనూర్ మల్లికార్జుననగర్‌కు చెందిన గుంటి సత్యనారాయణ కుమార్తె గాయత్రి (23) గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటుంది. ఉద్యోగ నిమిత్తం ఈనెల 3న సాయంత్రం 7 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆమె మరుసటి రోజు ఉదయం 7 గంటలకు ఇంటికి తిరిగి రావాల్సి ఉంది. కానీ ఆమె రాకపోవడం... ఆమె పనిచేసే కార్యాలయంతో పాటు బందువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోవడంతో తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసున మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగిని...

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ గ్రామానికి చెందిన దీపక్‌షా కుమార్తె ప్రియ(23) చంపాపేట్‌లోని హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకులో పనిచేస్తోంది. గతేడాది డిసెంబరు 31న ఉదయం 8 గంటలకు డ్యూటీకోసం చంపాపేట బ్యాంకుకు వెళ్లిన ఆమె సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్‌చేయగా స్విచ్ఛాప్ వస్తోంది. ఇంట్లో ఆమె పెళ్లికోసం పెట్టిన బంగారు ఆభరణాలు సైతం కన్పించడం లేదు. బందువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గణేష్ శోభాయాత్రలకు ఆటంకం రాకుండా చూడాలని వినతి

మెట్రో ఎండికి వినతి పత్రం ఇస్తున్న శశిధర్‌రెడ్డి, కళ్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త: హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైల్ విస్తరణ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా జరిగే పాతబస్తీ వినాయక విగ్రహాల శోభాయాత్రలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా మెట్రో పిల్లర్ల ఎత్తు పెంచాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డిని కోరాయి. ఈ మేరకు శనివారం భాగ్యనగర్ సమితి కార్యదర్శి శశిధర్, బాలాపూర్ సమితి చైర్మన్ కళ్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు ఎన్‌విఎస్‌రెడ్డిని కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శోభాయాత్రల్లో వినాయక విగ్రహాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెట్రో పిల్లర్లు, స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. లాల్ దర్వాజా మోడ్, ఫలక్‌నుమా, శాలీబండ, చార్మినార్, అఫ్జల్ గంజ్, బేగంబజార్ తదితర ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లాపూర్ థీమ్ పార్కు అభివృద్ధి పనుల పరిశీలన

పార్కు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడి

నాచారం, జనవరి 4 ప్రభాతవార్త : మల్లాపూర్ డివిజన్‌లో కొనసాగుతున్న థీమ్ పార్క్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి శనివారం పరిశీలించారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో సుమారు రూ. 4కోట్ల రూపాయలతో అత్యాధునిక హంగులతో, ఆహ్లాదమైన థీమ్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న సంక్రాంతి పండుగ తరువాత థీమ్ పార్కును ప్రారంభించుకుందామని తెలిపారు. నియోజకవర్గంలో అత్యంత సుందరంగా తయారవుతున్న థీమ్ పార్క్ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులను ఆదేశిస్తూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ. శ్రవంతి, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్, పద్మా రెడ్డి, దయాకర్ రెడ్డి, బుసాని రఘు, ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్ రావు, శీలం ప్రవీణ్, రఘు, పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రహిస్తే కఠిన చర్యలు తప్పవు : సిఐ

మాంజాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్

నేరేడ్‌మెట్, జనవరి 4 ప్రభాతవార్త : నిషేదించిన చైనా మాంజాలను విక్రహిస్తే సహించేది లేదని ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వినాయక నగర్,సంతోషిమా ఎక్స్ రోడ్ నందు గల కైట్ షాప్ లను పరిశీలించడం జరిగినది. ప్రభుత్వం నిషేధించినటువంటి చైనా మాంజాను అమ్మిన మరియు కలిగియున్న క్రిమినల్ కేసులు రిజిస్టర్ చేస్తామని హెచ్చరించడం జరిగినది. చైనా మంజ పక్షులకు, మనుషులకు కూడా చాలా ప్రమాదనమైనది. గతంలో చైనా మాంజా వలన మనుషులకు కూడా తీవ్ర గాయాలు అవడం జరిగిందని తెలిపారు.చనిపోయిన పరిస్థితులు కూడా మనం చూడడం జరిగిందన్నారు. చైనామాంజలు ఎట్టి పరిస్థితులలో ఉపయోగించరాదని షాప్ నిర్వహకులకు సూచించడం జరిగిందన్నారు.

ఆరోగ్య కేంద్రంలో సదుపాయాల కల్పన : బన్నాల గీత

ఉప్పల్ ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం రూ.30వేలు కేటాయించిందని, రోగులకు బెడ్‌లు మార్చినట్లు తెలిపారు. బోరు రిపేరు, ఫ్యాన్లు, గోడలకు రంగులు, ఫ్యాన్లు, దీపాలు మార్చాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది గదికి మరమ్మతులు చేయాలని సూచించారు. త్వరలోనే పనులు చేపడుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సౌశీల్య, డా.సంధ్యారాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీరప్పగడ్డ అసోసియేషన్ క్యాలెండర్ అవిష్కరణ

ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త : ఉప్పల్ బీరప్పగడ్డ వెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం స్థానిక శ్రీ తేనె లక్ష్మినరసింహాస్వామి ఆలయంలో అష్కరించారు. అసోసియేషన్ నేతలు రాచకొండ శివకుమార్, టి.లక్ష్మినారాయణ, ఎస్.కృష్ణ, ఎస్. నాగరాజు, పి.శ్రీనివాస్, ఎం..నవీన్, ఎస్.సురేందర్, ఎస్.మణికంత, కిరణ్‌కుమార్, ఈశ్వర్, పి.శివకుమార్, ఎస్.మధు, పి.కృష్ణ తదితరులు క్యాలెండర్ అవిష్కరించారు. ప్రతి ఏటా బీరప్పగడ్డ అసోసియేషన్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీలో ప్రజలకు మౌళిక సదూపాయలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డితో అకారపు అరుణ్ పటేల్ భేటి

సిఎం రేవంత్‌రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడ